సాక్షి
హనుమకొండ

శనివారం | 30 | మార్చి | 2024



ఈసారీ లోటు బడ్జెటేనా?

కేయూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ సుమారు రూ.431కోట్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

- 8లో▸



రైల్వే ఐఓహెచ్ షెడ్ ప్రారంభం

కాజీపేట డీజిల్ కాలనీలోని ఫిట్‌లైన్ సమీపంలో శుక్రవారం ఇంటర్‌మీడియట్ ఓవరాలింగ్(ఐఓహెచ్) బ్రేక్ డౌన్ ఎంఆర్‌వీ కోచ్ షెడ్‌ను రైల్వే అధికారులు ప్రారంభించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

40⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

ఇఫ్తార్	సహర్
శని 6:35	ఆది 4:49

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న డిగ్రీ ఫీజు గడువు

కేయూ క్యాంపస్: డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఏ లిటరేచర్, ఒకేషనల్ తదితర కోర్సుల (రెగ్యులర్, బ్యాక్‌లాగ్స్) రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ల ఫీజు గడువు ఈనెల 30 వరకు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఏప్రిల్ 10వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

పటిష్టతకు మారుపేరు భారతి సిమెంట్



మామునూరు: నాణ్యత, మన్నిక, పటిష్టతకు మారుపేరు భారతి సిమెంట్ అని ఆసంస్థ మేనేజర్ సతీశ్ రాజు, టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి అన్నారు. కంపెనీ.. భారతి అల్ట్రా ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని వారు వివరించారు. ఈమేరకు శుక్రవారం .. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని సాయి ఫర్టిలైజర్ షాపులో అసిస్టెంట్ మేనేజర్ శివప్రసాద్, డీలర్స్ అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడుతూ.. భారతి సిమెంట్ జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబ్, టాంపరింగ్ ప్రూఫ్ బ్యాగ్ మరింత సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని, వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ బలం చాలా అధికంగా ఉంటుందని వివరించారు. అనంతరం 50 మంది భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలకు ఉచిత ప్రమాద బీమా పత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో మేస్త్రీలు, కార్మికులు, డీలర్లు పాల్గొన్నారు.

నేడు స్థాయీ సంఘాల సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 30న జరుగుతాయని జెడ్పీ సీఈఓ విద్యాలత తెలిపారు. హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలుంటాయని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2, 3, 5, 6వ స్థాయీ సంఘ సమావేశం ఉదయం 10.30 గంటలకు, 4వ స్థాయీ సంఘ సమావేశం 11.30 గంటలకు, 7వ స్థాయీ సంఘ సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు, 1వ స్థాయీ సంఘ సమావేశం మధ్యాహ్నం 1 గంటకు జరుగుతుందని తెలిపారు.



ఇఫ్తార్ విందు

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో పశ్చిమ ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. **- హన్మకొండ చౌరస్తా**



భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

వరంగల్ నగరంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే నిర్వహించారు. 19వ డివిజన్ గాంధీనగర్‌లోని అసిస్సి చర్చిలో ఫాదర్ నీలూరి జ్వానేస్ ప్రార్థనలు జరిపారు. గాంధీనగర్ పురవీధుల గుండా సిలువ మార్గం ఊరేగింపు జరిగింది. ఏసుక్రీస్తు సిలువ మోసుకుంటూ వెళ్లడం, అనంతరం భటులు ఆయనకు సిలువ వేయడం తదితర దృశ్యాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై సిలువ ప్రదర్శనను తిలకించారు. **- కాశిబుగ్గ**

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం



నీటి సరఫరాపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ మల్లేశం

కమలాపూర్: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కమలాపూర్, నేరెళ్ల, గూడూరు గ్రామాల్లో పర్యటించారు. నీటి సరఫరాకు సంబంధించి అధికారులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో అంతరాయం కలిగే ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిని ప్రతీ ఇంటికి అందించేందుకు కృషి చేస్తున్నామని, వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో డీఈ శ్వేత, ఏఈ సుభాశ్‌రెడ్డి, ఎంపీడీఓ బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కావ్య!

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా నేడు ప్రకటన!?

- హైదరాబాద్‌లో దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ నేతలతో చర్చలు సఫలం
- నేడు మూడు రంగుల కండువా కప్పుకోనున్న కడియం శ్రీహరి, కావ్య..
- అనంతరం ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలను తల్లీకూతుళ్లు కలిసే అవకాశం
- బీఆర్ఎస్‌లో 'కడియం' కల్లోలం.. అభ్యర్థుల వేటలో గులాబీ 'బాస్'లు



సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకున్న డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు ఆమె అభ్యర్థిత్వానికి కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నేతలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఏఐసీసీ, టీపీసీసీ నేతల నుంచి సానుకూల స్పందన వచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య శుక్రవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ పెద్దలను కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, నేతలు రోహిత్ చౌదరి, విష్ణునాథ్, మల్లు రవి, సంపత్ కుమార్ సమావేశమయ్యారు. కాంగ్రెస్‌లో చేరే అంశంపై కడియంతో చర్చలు జరిపిన నేతలు, పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించడంతో సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నేడు కాంగ్రెస్ గూటికి..

గురువారం భారత్ రాష్ట్ర సమితి పార్టీకి రాజీనామా చేసిన కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య శనివారం టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకోనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు కాంగ్రెస్ నేతలతో సమావేశం అనంతరం మాట్లాడిన కడియం శ్రీహరి.. వివిధ కారణాలతో బీఆర్ఎస్‌కు ప్రజలు దూరమవుతున్న నేపథ్యంలో పోటీనుంచి తప్పుకున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరే అంశంపై అతి త్వరలో నిర్ణయం వెల్లడిస్తానన్న ఆయన నేడు ఆ పార్టీ కండువా కప్పుకోనున్నారు. కాగా హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఢిల్లీకి వెళ్లి సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులను కలుస్తారని సమాచారం. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సైతం అధికారికంగా కడియం కావ్య పేరును వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం కూడా ఉందని పార్టీవర్గాల సమాచారం.

'కారు'లో 'కడియం' కల్లోలం...

అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్‌లో గ్రూపుల పోరు సాగింది. ప్రధానంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆద్యంతం వివాదాలే జరిగాయి. చివరికి స్టేషన్‌ఘన్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే డా.టి.రాజయ్యను కాదని కడియం శ్రీహరికి టికెట్ ఇచ్చారు. దీంతో అలకబూనిన రాజయ్య కొద్ది రోజులు పార్టీకి దూరంగా ఉన్నారు. రంగంలోకి దిగిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్ రావు రాజయ్యకు రైతు బంధు సమితి చైర్మన్ పదవి ఇచ్చేలా కేసీఆర్‌తో మాట్లాడి జనగామ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు ఇవ్వడంతో చల్లబడ్డాడు. ఎన్నికల ఫలితాల తర్వాత కడియం శ్రీహరి గెలిచినా.. ప్రభుత్వం మారడంతో తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని రాజయ్య.. శ్రీహరి మీద కోపంతో పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత పరిణామాల్లో వర్ధన్నపేట నుంచి పోటీ చేసి ఓడిపోయిన అరూరి రమేశ్ వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా తనకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరినా అధిష్టానం నిరాకరించింది. కడియం శ్రీహరి కూతురు కావ్య పేరును ప్రకటించడంతో అసంతృప్తికి గురైన రమేష్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇదే స్థానం నుంచి టికెట్ ఆశించిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ సైతం కావ్యను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీటన్నింటినీ బీఆర్ఎస్ పార్టీ భరించి కడియం కావ్యను అభ్యర్థిగా కొనసాగించేందుకు అధిష్టానం అన్ని ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో.. తాను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేయలేనని గురువారం కేసీఆర్‌కు లేఖ రాయడం పార్టీలో సంచలనం రేపింది.

బీఆర్ఎస్ అభ్యర్థులుగా డా.సుధీర్, టి.రాజయ్య పేర్లు..

కడియం కావ్య అభ్యర్థిత్వం నుంచి తప్పుకోవడం.. తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్టానం అభ్యర్థుల వేటలో పడింది. మొదటి నుంచి అరూరి రమేశ్, కడియం కావ్యతోపాటు హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ కూడా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆయన ఉద్యమంలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కీలకంగా పనిచేశారు. ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమ నాయకులు నిరంజన్, బోడ డిన్న, జోరిక రమేశ్, రజని తదితరులు ప్రెస్‌మీట్‌లు పెట్టి తమలో ఒకరికి ఎంపీ టికెట్ ఇవ్వాలని పార్టీకి తమ వాయిస్‌ను వినిపించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి, వరంగల్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న కూడా వరంగల్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా, కడియం కావ్య అభ్యర్థిత్వం నుంచి తప్పుకున్న వెంటనే ఫిబ్రవరి 3న పార్టీకి రాజీనామా చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డా.తాటికొండ రాజయ్యతో కొందరు బీఆర్ఎస్ కీలక నేతలు శుక్రవారం చర్చలు జరిపినట్లు తెలిసింది. అందుకు ఆయన ఎన్నికల ఖర్చు పార్టీ భరించేటట్లు ఉంటే ఆలోచిస్తానని చెప్పినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా.. దీనిపై శనివారం నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడియం కావ్య పార్టీ నుంచి తప్పుకున్న తర్వాత సీరియస్‌గా అభ్యర్థి కోసం సెర్చింగ్ చేస్తున్న పార్టీ అధిష్టానం జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య, పెద్ది స్వప్న పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కడియం చేరికపై వ్యతిరేక స్వరాలు..

కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఇందిర సమావేశం

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్

కడియం శ్రీహరిపై దాస్యం ఫైర్

- 8లో▸

ఉద్యమ పార్టీకి నేతల బైబై..

- బీఆర్ఎస్‌ను వీడుతున్న ఓరుగల్లు ఎమ్మెల్యేలు, ఎంపీలు
- ఆదరించిన గడ్డమీదే బీఆర్ఎస్‌కు శరాఘాతం
- మాజీ ఎంపీ సీతారాం నాయక్ నుంచి కడియం శ్రీహరి వరకు
- ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న సీనియర్లు
- ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ సారయ్యపైనా ప్రచారం?!

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉద్యమాల ఖిల్లా.. ఓరుగల్లులో బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్ తగులుతోంది. గులాబీ కోటకు బీటలు వారుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజుకున్న అసంతృప్తి ఓటమి తర్వాత.. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బట్టబయలవుతోంది. స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, రైతుబంధు సమితి మాజీ చైర్మన్ డాక్టర్ తాటికొండ రాజయ్య, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్‌తో మొదలైన రాజీనామాల పరంపర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరకు సాగడం బీఆర్ఎస్‌కు శరాఘాతంగా మారింది. ఇదే సమయంలో మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత పార్టీ మారతారన్న చర్చ జరగ్గా.. ఆమె తీవ్రంగా ఖండించారు. ఇదే సమయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సైతం పార్టీ మారే యోచనలో ఉన్నారన్న ప్రచారం శుక్రవారం నుంచి మొదలైంది.

ఆదరించిన గడ్డమీదే చావు దెబ్బ..

బీఆర్ఎస్‌ను ఆదరించిన ఓరుగల్లు నుంచే ఆ పార్టీకి చావుదెబ్బ తగులుతోంది. ఫిబ్రవరి 3న స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డా.టి.రాజయ్య బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ ఇవ్వకపోయినా జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసినా కనీస గుర్తింపు లేదని, ఆరు నెలలు మానసిక వేదనకు గురై పార్టీని వీడుతున్నట్లు కేసీఆర్‌కు పంపిన రాజీనామా లేఖలో స్పష్టం చేశారు. ఇది జరిగిన నెలరోజుల్లోనే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ ఆ పార్టీని వీడారు. రాజయ్య వేచిచూసే ధోరణిలో ఉండగా.. రమేశ్ బీజేపీలో చేరి వరంగల్ అభ్యర్థిగా తలపడుతున్నారు. అంతకు ముందు మహబూబాబాద్ బీఆర్ఎస్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ పార్టీని వీడి కాషాయం కండువాను కప్పుకున్నారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మార్చి 15న వరంగల్ ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడు పసునూరి దయాకర్ ఆ పార్టీని వీడి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కూడా హైదరాబాద్‌లో సీఎం, ముఖ్యనేతలను కలిశారు. తాజాగా స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఆయన కూతురు వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డా.కడియం కావ్య గురువారం 'యూ' టర్న్ తీసుకున్నారు. ఎంపీ అభ్యర్థి పోటీ నుంచి తప్పుకున్న కడియం కావ్య తండ్రితో కలిసి కాంగ్రెస్ అగ్రనేతలు దీపాదాస్ మున్షీ తదితరులను శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. శనివారం వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం పోరాటాల జిల్లా ఓరుగల్లులో ఉద్యమ పార్టీకి చావుదెబ్బ తగిలినట్లేనన్న చర్చ జరుగుతోంది.

అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణం



చింత సారయ్య(ఫైల్)

ఐనవోలు: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు సరిగ్గా పండకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడం కారణంగా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు చింత సారయ్య(47) ఆత్మహత్య చేసుకున్నాడు. సారయ్య తనకున్న ఎకరంన్నర వ్యవసాయ భూమితో పాటు మరో రైతు నుంచి మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈభూమిలో వరి, మొక్కజొన్న, కూరగాయలు సాగు చేస్తూ వస్తున్నాడు. మూడేళ్ల కాలంలో ఏనాడూ పంటలు సరిగ్గా పండకపోవడంతో తీసుకున్న అప్పులు రూ.5 లక్షలు వరకు అయ్యాయి. దీనికి తోడు ప్రస్తుతం కూడా పంటలు పండక పోవడం, కూరగాయలకు మార్కెట్‌లో ధర లేకపోవడం కారణంగా పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. తీవ్ర మనస్తాపానికి గురైన సారయ్య పెళ్లీడుకొస్తున్న కూతుళ్లకు ఎలా పెళ్లి చేయాలి? తమ కుటుంబ పోషణ ఎలా గడవాలి? అప్పులు ఎలా తీరాలి అని తీవ్రంగా ఆలోచించి మనో వేదనకు గురయ్యాడు. ఈనెల 27న బుధవారం మధ్యాహ్నం ఎవరూ ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఇంటికొచ్చిన కుటుంబ సభ్యులు గమనించి వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు సారయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు సామ్యేల్ ఫిర్యాదు మేరకు ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈవిషయంపై ఎస్సై అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా.. సరైన సమాధానం ఇవ్వలేదు.

నిబంధనలకు నిప్పు!

'గ్రేటర్'లో లెక్కాపత్రం లేని వాణిజ్య భవనాలు.. రక్షణ చర్యలు శూన్యం

- అడ్డగోలుగా పెరుగుతున్న అంతస్తులు.. 'మనీ'తో మేనేజ్
- తొమ్మిదేళ్లుగా ఎన్‌ఓసీ రెన్యూవల్ చేసుకోని జకోటియా కాంప్లెక్స్
- ఘటనలు జరిగాక ఒకటి, రెండు రోజులు హడావిడి

వరంగల్ అర్బన్: నగరంలో 6 మీటర్ల నుంచి 15 మీటర్ల కంటే తక్కువ ఎత్తు భవనాలకు గ్రేటర్ వరంగల్ అగ్నిమాపక విభాగం నిరభ్యంతర (ఎన్‌ఓసీ) సర్టిఫికెట్ ఇవ్వాలి. 15 మీటర్ల కంటే ఎత్తు ఉంటే.. అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ కావాలి. కానీ.. నగరంలో జరుగుతున్న ఎత్తయిన వాణిజ్య భవనాలకు అగ్నిమాపక శాఖల అనుమతులేమీ ఉండడం లేదు. వీటి గురించి ఎవరూ పట్టించుకోవట్లేదు. వాణిజ్య భవనాలు, భారీ హోల్‌సేల్ దుకాణాలు కూడా ఎన్‌ఓసీ తీసుకోవడం లేదు. ఒకవేళ తీసుకున్నా.. రెన్యూవల్ చేసుకోవడం మానేశారు. గ్రేటర్ ఫైర్, అగ్నిమాపక శాఖల అధికారులు మాత్రం చుట్టపుచూపుగా రాత పూర్వక నోటీసులు జారీ చేస్తూ.. చేతులు దులుపుకుంటున్నారు. ఫైర్ వింగ్ ఉన్నా లేనట్లే అనే పరిస్థితి నగరంలో కనిపిస్తోంది.

భారీగా వాణిజ్య భవనాలు..

హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌లో భారీగా వాణిజ్య భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. భారీ విస్తీర్ణం, ఎత్తయిన భవనాల నిర్మాలు, వాణిజ్య దుకాణాలు, ఆస్పత్రులు, మల్టీప్లెక్స్‌లు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నగరంలో సుమారు 800 వరకు 6 నుంచి 18 మీటర్లు(అంతకు మించి) కలిగిన భారీ భవనాలున్నాయి. వాటిలో 30 శాతం వరకు ఫైర్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేశారు. కానీ.. వీటిలో 10 శాతం కూడా ప్రతీ ఏడాది రెన్యూవల్ చేసుకోవడం లేదు. వీటన్నింటికీ తప్పనిసరిగా బల్దియా, అగ్నిమాపక శాఖల నుంచి ఏటా ఎన్‌ఓసీలు తీసుకోవాలి. ఎన్‌ఓసీ ఉన్న భవనాలకు మాత్రమే టౌన్ ప్లానింగ్ విభాగాధికారులు వినియోగ ధ్రువీకరణ పత్రం (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) ఇవ్వాలి. కానీ.. ఎన్‌ఓసీ ఉందా? లేదా? అనేది మాత్రం పట్టించుకోవడం లేదు. సంబంధిత సర్టిఫికెట్లను ఆవిభాగాధికారులు కాసులకు కక్కుర్తిపడి జారీ చేస్తున్నారు. 2016కు ముందు నగరంలో.. 385 బడా భవనాలకు బల్దియా ఫైర్ సేఫ్టీ లేదని నోటీసులు జారీ చేయగా.. 90 భారీ భవనాల నిర్వాహకులు స్పందించి ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన వారు స్పందించడం లేదు. అందులో చాలా మేరకు అపార్టుమెంట్లు, షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్‌లు, విద్యా సంస్థలు, దుకాణాలు, ఫంక్షన్ హాల్స్, గోదాములు, పాత సామాన్ల గోదాంలు ఉన్నాయి.

ఒకే ఒక్కడు..

గ్రేటర్ వరంగల్‌లో ఫైర్ వింగ్ ఉన్నప్పటికీ కేవలం ఒకే ఒక్క డీఎఫ్ఓ ఉన్నారు. ఆర్ఎఫ్ఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇతర అధికారులు, సిబ్బంది లేరు. వరదలు, కూల్చివేతలు, ఇతర విపత్తులతో ఫైర్ విభాగం సరిపెట్టుకుంటోంది. ఫైర్ నిబంధనలపై ఏ మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, బల్దియా డీఎఫ్ఓ మాట్లాడుతూ జకోటియా కాంప్లెక్స్ నిర్వాహకులు 2016 నుంచి ఎన్‌ఓసీ తీసుకోవడం లేదని తెలిపారు. పలుమార్లు నోటీసులు జారీ చేశామని చెప్పారు. 2016–2021 వరకు భవనాల్ని ఫైర్ సేఫ్టీ అగ్నిమాపక శాఖ చూసిందని, 2022 జనవరి నుంచి బల్దియా ఫైర్ విభాగానికి అప్పగించినట్లు చెప్పారు.

జకోటియా కాంప్లెక్స్‌కు తొమ్మిదేళ్లుగా ఎన్‌ఓసీ లేదు



గురువారం అగ్ని ప్రమాదం జరిగిన జకోటియా కాంప్లెక్స్‌కు 2015లో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకున్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు రెన్యూవల్ చేసుకోలేదు. ఫైర్ పరికరాలు అన్నీ దెబ్బతిని పైపులు మొత్తం జామ్ అయ్యాయి. ఈ కాంప్లెక్స్‌కు ఇన్నేళ్ల కాలంలో నోటీసులు జారీ చేసిన దాఖలాల్లేవు. కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ కార్యాలయంలో జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన మంటలను ఆర్పే ఫైర్ పరికరాలు ఏమాత్రం పనికి రాకుండా పోయాయి. దీంతో భారీ నష్టం వాటిల్లింది.

ముగిసిన 'ఎర్రగట్టు' బ్రహ్మోత్సవాలు

- ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు
- నేడు హుండీ లెక్కింపు



హసన్‌పర్తికి తిరిగి పయనమైన దేవతామూర్తులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. హోలీ పండుగ నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం దేవతామూర్తులను రథాలపై ప్రతిష్ఠించి ఎర్రగట్టు దేవాలయం నుంచి భారీ ప్రదర్శనగా ఆయా గ్రామాలకు తిరిగి చేర్చారు. చివరి రోజు కూడా ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఉదయం నుంచే దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. వేడుకలను పురస్కరించుకుని విశ్వక్సేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. నగర మేయర్ గుండు సుధారాణి స్వాముల వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. పూజా కార్యక్రమంలో ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, నరోత్తంరెడ్డి, కనపర్తి రాజు, సంగాల ప్రశాంత్, పెద్దమ్మ సురేశ్, శ్రీనాథ్, శైలజ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి శేఖర్‌రావు, మాజీ వార్డు సభ్యుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

ఎర్రగట్టు వేంకటేశ్వస్వామి జాతర హుండీ లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం మొదలవుతుందని వివరించారు.

పెళ్లి వేడుక చూసేందుకువెళ్లి..

● డీజే సౌండ్ బాక్సులు మీదపడడంతో బాలుడి మృతి


మనోజ్ మృతదేహం

కురవి: తండాలో జరుగుతున్న పెళ్లి వేడుకలను వీక్షించేందుకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు డీజే బాక్స్‌లు మీద పడడంతో మృతిచెందాడు. ఈ విషాదఘటన మానుకోట జిల్లా సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు బూర్గుచెట్టు తండా జీపీ పరిధి పీక్లా(బడి) తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీక్లా తండాకు చెందిన బానోత్ నాగేష్ వివాహం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. శుక్రవారం తండాలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్సాహం కోసం డీజే సౌండ్ బాక్సులను టాటా ఏస్ వాహనంలో అమర్చారు. ఈక్రమంలో వాహనంలో ఏర్పాటు చేసిన డీజే బాక్స్‌లకు నిర్వాహకుడు ఎలాంటి కట్టు కట్టకపోవడంతో వేడుకలను చూసేందుకు వచ్చిన బానోత్ శ్రీను–భద్రల రెండో కుమారుడు ఆరో తరగతి చదువుతున్న బానోత్ మనోజ్(14)పై బాక్స్‌లు పడ్డాయి. అక్కడే ఉన్న తండావాసులు మనోజ్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతిచెందాడని నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని తండాకు తీసుకొచ్చారు. ఈ విషయమై మనోజ్ తల్లిదండ్రులు బానోత్ శ్రీను, భద్రలు సీరోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజే సౌండ్ బాక్సులు భద్రతలేకుండా టాటా ఏస్ వాహనంలో అమర్చి తన కుమారుడి మృతికి కారకుడైన ట్రాలీ నడిపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్‌ను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు బోడ సాయిపై కేసు నమోదు చేసి, మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రయాణికులపై చేయిచేసుకున్న రైల్వే టీసీ

మహబూబాబాద్ రూరల్ : రైలులో ప్రయాణిస్తున్న దంపతులపై రైల్వే టీసీ శుక్రవారం చేయిచేసుకున్నాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణంలోని జగ్జీవన్ రావు కాలనీకి చెందిన భూక్య భద్రునాయక్, వసంత దంపతులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో టికెట్ తీసుకుని ఎంజీఆర్ చెన్నై రైలు జనరల్ బోగిలో జనం అధికంగా ఉండటంతో రిజర్వేషన్ బోగిలో ఎక్కారు. రైలు కేసముద్రం స్టేషన్ చేరుకుంటున్న సమయంలో విధుల్లో ఉన్న టీసీ వచ్చి రిజర్వేషన్ బోగిలో ఎందుకు ఎక్కారని అడుగగా జనరల్ బోగిలో జనం అధికంగా ఉండటంతో రిజర్వేషన్ బోగిలో ఎక్కామని చెప్పారు. అయినప్పటికీ ఆ టీసీ అసభ్యకర పదజాలంతో దూషిస్తూ.. మెడలు పట్టుకుని నెట్టేస్తుండగా.. తోటి ప్రయాణికులు అడ్డుకున్నారు. జరిగిన సంఘటనపై బాధితులు మహబూబాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు వెళ్లగా వారుకూడా ఇష్టం వచ్చినట్లు మాట్లాడి.. మెడలుపట్టి నెట్టారని భద్రునాయక్, వసంత ఆవేదన వ్యక్తం చేశారు.



ఈసారీ లోటు బడ్జెటేనా?



కేయూ అంచనా బడ్జెట్ రూ.431కోట్లపైనే?

● మౌలిక సదుపాయాల కల్పనకు నిధులివ్వని ప్రభుత్వం
● అంతర్గత నిధులే ఆధారం
● నేడు కేయూ 39వ అకడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ (2024–25) ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ సుమారు రూ.431కోట్లుగా ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. శనివారం కేయూ 39వ అకాడమిక్ సెనెట్ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టబోతున్నారు. ప్రభుత్వం బ్లాక్ గ్రాంట్ కింద కేయూకు రూ.134కోట్లకుపైగా కేటాయించినట్లు తెలుస్తోండగా.. ఈ విషయం అధికారికంగా వెల్లడికాలేదు. ఈ గ్రాంట్ కేవలం టీచింగ్, నాన్‌టీచింగ్ రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలకే సరిపోతుంది. మిగితా కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లకు తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించిన వేతనాల చెల్లింపునకు అంతర్గత నిధులే సమకూర్చుకోవాల్సి వస్తుంది. గత 2023–24లో నాటి ప్రభుత్వం రూ.127కోట్ల50లక్షలు కేటాయించి.. రూ.96కోట్ల 50లక్షలు మాత్రమే విడుదల చేసింది. అన్నికేటగిరీలకు కలిపి వేతనాల కోసం యూనివర్సిటీ అధికారులు ఈ ఆర్థికసంవత్సరానికి రూ.166కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కానీ రూ.134కోట్లకుపైగానే కేటాయించినట్లు తెలుస్తోంది.

నిధులలేమి..

గత పదేళ్లుగా కాకతీయ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వంనుంచి మౌలిక సదుపాయాలకల్పన.. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయింపులు చేసినా.. నిధులు మాత్రం విడుదల చేయలేదు. కేవలం బ్లాక్ గ్రాంట్ మాత్రమే విడుదల చేస్తూ వచ్చారు. దీంతో మౌలిక సదుపయాల కల్పన, అభివృద్ధి పనులకు అంతర్గత నిధులు వినియోగించాల్సిన అవసరం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు కలిపి రూ.500కోట్లు కేటాయించింది. అందులో కేయూకు ఎంత అనేది నేటికీ స్పష్టతలేదు.

బెనిఫిట్స్ ఆలస్యం..

యూనివర్సిటీ బ్లాక్‌గ్రాంట్ విడుదల చేస్తున్న ప్రభుత్వం ఆచార్యుల ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ నిధులు మాత్రం ఇవ్వటంలేదు. దీంతో అంతర్గత నిధులతో సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.


రెగ్యులర్ కంటే పెన్షనర్లే ఎక్కువ

కేయూలో 83మంది రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తుండగా కాంట్రాక్టు లెక్చరర్లు 181, పార్ట్‌టైం 206 మంది పనిచేస్తున్నారు. పెన్షనర్లు (అధ్యాపకులు) 259మంది ఉండగా.. ఫ్యామిలీ పెన్షనర్లు 59మంది ఉన్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగులు 420మంది ఉండగా పెన్షనర్లు 450మందికిపైగా ఉన్నారు. తాత్కాలిక ఉద్యోగులు 507 మంది ఉన్నారు.

వ్యయమే ఎక్కువ..

కేయూలో 2023– 24ఆర్థిక సంవత్సరంలో రూ.389.53కోట్లుతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024– 25లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్ రూ.134కోట్లతోపాటు అంతర్గత నిధులు.. ఇతరత్రా ద్వారా రాబడి రూ.431కోట్లుకు పైగా ఉంటుందని అంచనా. దీంతోపాటు వ్యయం కూడా అంతకంటే ఎక్కువగా రూ.449కోట్లకుపైగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసి.. తద్వారా లోటు బడ్జెట్‌గా చూపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. రాబడి, ఖర్చులు వేర్వేరుగా 8అంశాల్లో చూపిస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో కేయూ బడ్జెట్‌లో రూ.15.47కోట్ల లోటుబడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మొక్కుబడిగా సెనెట్ సమావేశం

కేయూలో అకడమిక్ సెనెట్ అత్యంతకీలకం.. ఇందులో అకడమిక్ విద్యాపరమైన అంశాలు, కొత్త కోర్సులు, సిలబస్ మార్పులు చేర్పులు, విద్యార్థులు, పరిశోధనలకు సంబంధించిన అంశాలల్లో ఎలాంటి మార్పులు తీసుకరావాలి, కేయూలో ఎలాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే అంశాలపై చర్చలు జరగాల్సి ఉంటుంది. కానీ, దశాబ్దన్నర కాలంగా కేవలం మొక్కుబడిగానే ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. పేరుకు అకడమిక్ సెనెట్ సమావేశం అని చెప్పినా అందులోనే బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. సెనెట్ సభ్యులు కూడా కొంత మంది మాత్రమే హాజరవుతున్నారు.

బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రొఫెసర్ అమరవేణి

కేయూ 39వ అకడమిక్ సెనెట్ సమావేశాన్ని శనివారం పరిపాలనాభవనంలోని సెనెట్ హాల్‌లో ఉదయం 11గంటలకు వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. 2022– 23వార్షిక నివేదిక, 2023–24 కేయూ స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. ఇదిలా ఉండగా కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ హెడ్, ఆ విభాగం డీన్ ప్రొఫెసర్ అమరవేణి సెనెట్‌లో 2024–2025బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, సెనెట్ సభ్యులు పాల్గొంటారు.

తగ్గిన సెనెట్ సభ్యుల సంఖ్య

యూనివర్సిటీ నిబంధనల ప్రకారం అకాడమిక్ సెనెట్‌లో వీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మాజీ వీసీలు, అన్ని విభాగాల డీన్‌లు, యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, స్కూల్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇంటర్, ఉన్నత విద్య ఉన్నతాధికారులు మొదలుకొని సమాజంలోని వివిధ రంగాల్లోని వారు కూడా సభ్యులుగా ఉంటారు. జూనియర్, డిగ్రీ కాలేజీల నుంచి కూడా ప్రాతినిధ్యం ఉంటుంది. పాలకమండలి సభ్యులు కూడా ఉంటారు. విద్యార్థులు, పరిశోధకుల నుంచి, అవకాశం కల్పించాల్సి ఉండగా.. కొన్ని వర్గాలకు ప్రాతినిధ్యమే లేకుండాపోయింది. సెనెట్‌లో సుమారు 150మందికిపైగా సభ్యులకు అవకాశం ఉండగా.. ప్రస్తుతం కేవలం 52మంది సభ్యులే ఉన్నారు. ప్రస్తుతం పాలకమండలి సభ్యులు కూడా లేరు. అందులో ఎంత మంది హాజరవుతారో వేచి చూడాల్సిందే. ప్రతి మూడు సంవత్సరాలకోసారి సమీక్షించి సభ్యులను నియమించాల్సి ఉంటుంది.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్

● బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్న కడియం శ్రీహరి బీఆర్ఎస్ ద్వారా పొందిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే వ్యక్తి కడియం అని ధ్వజమెత్తారు. నిత్యం నీతులు చెప్పే శ్రీహరి.. కనీసం ఈ సారైనా పాటించాలని సూచించారు. ఎదుగుతున్న దళిత నాయకులపై కుట్రలు చేసి, చాడీలు చెప్పిన నీచచరిత్ర శ్రీహరిది అంటూ దుయ్యబట్టారు. గుండె విజయరామారావు, రామగళ్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేశ్‌లు శ్రీహరి స్వార్థ రాజకీయాలకు, పదవుల కోసం బలైపోయి, బయటకు వెళ్లారన్నారు. నీతి, నిజాయితీ అంటూ బ్లాక్ మెయిల్ చేసి కూతురుకు వరంగల్ ఎంపీ అభ్యర్థిత్వాన్ని పొందావని అన్నారు. తాను గురువారం రాత్రి 8 గంటలకు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంపై చర్చించడానికి ఇంటికి వెళ్తే కనీసం మాట మాత్రమైనా చెప్పలేదని, రాత్రి 9గంటల తర్వాత కావ్య విడుదల చేసిన లేఖ సోషల్ మీడియాలో చూసి ఆశ్చర్యానికి గురయ్యానన్నారు. రాత్రికి రాత్రే కాంగ్రెస్‌తో ప్యాకేజీ మాట్లాడుకుని లేఖ విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారం కోల్పోగానే శ్రీహరి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇప్పటి నుంచి రాజకీయ విలువలు, నిజాయితీ అంటూ నీతులు చెప్పడం మానుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా సంస్థల మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, నాయకులు జోరిక రమేష్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, బొల్లికుండ వీరేందర్, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.

కడియం చేరికపై వ్యతిరేక స్వరాలు..

● కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సింగపురం ఇందిర సమావేశం
● పలు అంశాలపై చర్చ.. త్వరలో భారీ బహిరంగ సభ


హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో వ్యతిరేక సమావేశాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ముందుగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీతో ఆమె సమావేశమై నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గత ముప్పై సంవత్సరాలుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని, పార్టీ నాయకులు, కార్యకర్తలను శ్రీహరి ఏవిధంగా ఇబ్బందులకు గురిచేశారనే విషయాలను చర్చించారు. అవకాశవాద రాజకీయాలు చేసే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించి కడియం శ్రీహరిని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎంతగా వ్యతిరేకిస్తున్నారో అధిష్టానానికి తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆమె భరోసా ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు కీసర దిలీప్‌రెడ్డి, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కోళ్ళ రవిగౌడ్, సుభాష్‌చందర్ రెడ్డి, మేకల నరేందర్, భాస్కర్‌రెడ్డి, రమేష్, వెంకట్ రెడ్డి, కె.మహేందర్‌తో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో పొగలు


ఆందోళనతో రైలు దిగిన ప్రయాణికులు


మరమ్మతు చేస్తున్న మెకానిక్ సిబ్బంది

● కాజీపేట జంక్షన్‌లో గంటపాటు నిలిపివేత
● బీ–4 ఏసీ కోచ్‌కింద బ్యాటరీ ఫెయిల్యూర్‌తోనే పొగలు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలులోని బీ–4 ఏసీ కోచ్‌కింద బ్యాటరీ ఫెయిల్యూర్‌తోనే పొగలు రావడంతో శుక్రవారం రాత్రి కాజీపేట జంక్షన్‌లో నిలిపివేశారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించిన పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఏసీ త్రి టైర్ బీ–4 కోచ్ కింద పొగలు రావడాన్ని మెకానిక్ సిబ్బంది గమనించారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. రైలును నిలిపివేయడంతో ప్రయాణికులు భయాందోళనతో ప్లాట్‌ఫాంపై ఉండిపోయారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ, వివిధ విభాగాల రైల్వే అధికారులు హుటాహుటిన జంక్షన్‌కు చేరుకున్నారు. మెకానిక్ సిబ్బంది బీ–4 కోచ్ కింద పరిశీలించి చూడగా ఎలక్ట్రిక్ సమస్యతో బ్యాటర్ పేలి పొగలు వస్తున్నట్లు నిర్ధారించారు. బ్యాటరీని మరమ్మతు చేశారు. రాత్రి 8:52 గంటలకు కాజీపేటకు చేరుకున్న రైలును 9:56 గంటలకు తిరుపతి వైపు పంపించారు.

కాజీపేటలో రైల్వే ఐఓహెచ్ షెడ్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్‌కాలనీలోని ఫిట్‌లైన్ సమీపంలో శుక్రవారం ఇంటర్ మీడియట్ ఓవరాలింగ్ (ఐఓహెచ్) బ్రేక్‌డౌన్ ఎంఆర్‌వీ కోచ్ షెడ్‌ను రైల్వే అధికారులు ప్రారంభించారు. గత సంవత్సరం అధికారులు ఐఓహెచ్ షెడ్ పనులకు శంకుస్థాపన చేశారు. సికింద్రాబాద్, కాజీపేట రైల్వే అధికారులు కలిసి ఈ షెడ్‌ను ప్రారంభించారు. దీంతో బ్రేక్‌డౌన్ మెడికల్ రిలీఫ్ వ్యాన్ రైలు (ఎంఆర్‌వీ) కోచ్ ఐఓహెచ్ షెడ్యూల్ మరమ్మతును ప్రారంభించారు.

ఆరని అగ్గి..


శుక్రవారం ఉదయం ఎగిసిపడుతున్న మంటలు

ఉదయం 5.30గంటలకు మరోమారు ఎగిసిపడిన మంటలు

● ప్రమాద స్థలంలో కానరాని ఫైరింజన్‌లు
● స్థానికుల సమాచారంతో 40 నిమిషాల తర్వాత రాక


విచారణ చేస్తున్న నిఘా బృందాలు

రామన్నపేట : ఓరుగల్లు నగరం నడిబొడ్డున రిలయన్స్ షాపింగ్ మాల్‌లో జరిగిన అతిపెద్ద అగ్ని ప్రమాదం ఘటనలో జిల్లా ఫైర్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. సుమారు ఐదు గంటలకుపైగా పెద్ద ఎత్తున ఎగిసిపడిన మంటలను ఆర్పిన సిబ్బంది తదుపరి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో శుక్రవారం ఉదయం 5.30గంటల ప్రాంతంలో మరోమారు అగ్ని జ్వాలలు ఎగిసిపడ్డాయి. అతి పెద్ద ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద సుమారు 24గంటల పాటు ఉండి పర్యవేక్షించాల్సిన ఫైర్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. గురువారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో ఘటన స్థలం నుంచి వెళ్లిన ఫైరింజన్లు తిరిగి రాకపోగా.. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో శుక్రవారం ఉదయం మరోమారు మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కాంప్లెక్స్‌లోని మరో రెండు కార్యాలయాలు అగ్ని ఆహుతికి అయ్యాయి. స్థానికుల సమాచారంతో ఉదయం 6గంటలకు ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది 40 నిమిషాల తర్వాత మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో మరో రూ.కోటి ఆస్తినష్టం జరిగినట్లు కార్యాలయ నిర్వాహకులు వెల్లడిస్తున్నారు.

పరిశీలించిన కమిషనర్..

గురువారం జరిగిన అగ్నిప్రమాద పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శించిన గ్రేటర్ కమిషనర్, కలెక్టర్‌పై మంత్రి సురేఖ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో శుక్రవారం మరోమారు మంటలు చెలరేగిన విషయం తెలుసుకున్న విషయం తెలుసుకున్న కమిషనర్, డీసీపీ బారీ ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు.

ప్రమాద తీరుపై నిఘా బృందాల పరిశీలన

అగ్ని ప్రమాదం ఎలా జరిగింది. ఏమేరకు ఆస్తినష్టం జరిగింది.. ప్రమాదానికి కారణాలపై ఆరాతీసేందుకు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో ఫోరెన్సిక్, పోలీస్ క్లూస్ టీమ్ సభ్యులు మధ్యాహ్నం కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లనే జరిగిందా.. ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేశారా.. లేదా.. అనే కోణంలో విచారణ సాగించారు. షాపింగ్ కాంప్లెక్స్ అనుమతులు, భవన నిర్మాణ ప్లాన్, ఫైర్ సెఫ్టీ అనుమతులు, కొనసాగుతున్న తీరును పరిశీలించారు.

ఏసీల నుంచి వచ్చిన మంటలతోనే ప్రమాదం

కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో రాత్రి 7.15లకు ఏసీల నుంచి వచ్చిన మంటల ద్వారానే అగ్ని ప్రమాదం జరిగిందని మేనేజర్ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు. కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో కార్యాలయం వెలుపల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి శబ్దం వచ్చిన కొద్దిసేపటికే ఏసీల నుంచి మంటలు వ్యాపించినట్లు తెలిపారు. మంటలను ఆర్పేందుకు సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం, వద్దిరాజు కన్వెన్షన్ హాల్, బీలీఫ్ రెస్టారెంట్‌లు ప్రమాదానికి గురైనట్లు ఫిర్యాదులో తెలిపారు.

– గోపి, సీఐ, మట్టెవాడ

ఉద్యోగాల పేరుతో భారీ మోసం

● రూ.25లక్షల విలువైన బంగారం స్వాధీనం
● ప్రధాన నిందితుడు అరెస్టు

వరంగల్ క్రైం : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గ్రూప్–1 ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాలోని ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం అదాలత్ జంక్షన్ వద్ద అనుమానస్పదంగా కనిపించిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకొని విచారించగా ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన కొత్త వీరేశంగా నిర్ధారణ అయిందని తెలిపారు. ఈనేపథ్యంలో సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ పిన్నవారి స్ట్రీట్‌కు చెందిన ప్రధాన నిందితుడు కొత్త వీరేశం, మరో ఎనిమిది మంది కలిసి ముఠాగా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేస్తూ భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు వీరేశం గతంలో ప్రభుత్వ అధికారుల దగ్గర చిన్న చిన్న పైరవీలు చేసుకుంటూ ఉండేవాడని అధిక మొత్తంలో తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో తన కుమారుడు గోపినాథ్, తన స్నేహితుడు హైదారాబాద్‌కు చెందిన గూడురు పవన్‌కుమార్, అయన భార్య గూడురు వెంకటపద్మజతో కలిసి తెలుగు రాష్ట్రాల్లో పోలీస్ అధికారులు, రాజకీయ ప్రముఖులతో పరిచయాలు ఉన్నట్లు చెప్పి ఇతరులను నమ్మించేవారని పేర్కొన్నారు. గూడురు పవన్‌కుమార్ మామ అయిన బొమ్మన రఘునందన్‌రావు కరీంనగర్‌లోని ప్రతిమ హాస్పిటల్‌లో పనిచేయడంతో ఆయన బోయినపల్లి రవీందర్‌రావును పరిచయం చేశారని, రవీందర్‌రావుకు కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాల యజమాని శ్రీనివాస్‌రావుతో బంధుత్వం ఉండటం కారణంగా అతనితో తెలంగాణ ప్రభుత్వంలో పనులు అవుతాయని, ఎవరినైనా మోసం చేసి డబ్బులు సంపాదించాలని ముఠా సభ్యులు ప్లాన్ అని తెలిపారు. పవన్‌కుమార్‌కు బంధువైన అడ్వకేట్ ఉట్కూరి శ్రీనివాస్‌రావు వీరికి సహకరిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న బుచ్చిబాబును పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ముఠా రెండు రాష్ట్రాల్లో సుమారు రూ.4.50కోట్లు దండుకున్నట్లు వెల్లడించారు.

పోలీస్ భార్య ఫిర్యాదుతో వెలుగులోకి..

ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి కుమారుడికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్ –1 ఉద్యోగం ఇప్పిస్తానని ముఠా సభ్యులు ఆయన నుంచి రూ.2.50కోట్లు తీసుకొని ఉద్యోగం పెట్టించలేదు. దీంతో రిటైర్డ్ అధికారి భార్య వారం శ్రీదేవి కోర్టును ఆశ్రయించడంతో ఈ ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయి.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న సొత్తు

నిందితులు వీరే..

ప్రధాన నిందితుడు కొత్త వీరేశంతోపాటు హైదరాబాద్ ఎల్‌బీనగర్‌కు చెందిన గూడురు పవన్‌కుమార్, గూడురు పద్మజ, వరంగల్‌కు చెందిన కొత్త గోపినాథ్, ఖమ్మంకు చెందిన ఉట్కూరి శ్రీనివాస్‌రావు, ప్రకాశం జిల్లాకు చెందిన బుచ్చిబాబు, వరంగల్‌కు చెందిన కొత్త అరుంధతి, సికింద్రాబాద్‌కు చెందిన కొత్త పూజితలు ఈ ముఠాలో ఉన్నట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. నిందితుడి నుంచి రూ.25లక్షల విలువ గల బంగారం, రూ.71,700 నగదు, మూడు పాస్‌పోర్టులు, బ్యాంక్ చెక్ బుక్‌లు, ప్రామిసరీ నోట్లు, స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

● ఒకరు మృతి


భద్రు మృతదేహం

గూడూరు: ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనలో ఒకరు మృతి చెందారు.. ఈ సంఘటన మానుకోట జిల్లా గూడూరు మండలంలోని గుండెంగ శివారు తేజావత్ ధంజ్యా తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధంజ్యాతండాకు చెందిన తేజావత్ భద్రు కుమారుడు లక్ష్మణ్ కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. లక్ష్మణ్ మృతికి తండాకు చెందిన నవీన్ కారణమంటూ లక్ష్మణ్ తండ్రి భద్రు తండాలో ప్రచారం చేస్తున్నాడు. దీంతో అదే తండాకు చెందిన నవీన్, అతని భార్య రేణుక, బానోత్ సునీత, అమ్మి కలిసి భద్రుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య తేజావత్ విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.